www.nagaranijam.com PRGI/RNI NO: APTEL/2013/54450




# నగరనిజం

www.nagaranijam.com అక్షరనిజం నగరనిజం తెలుగు దిన పత్రిక

NN TV TELANGANA నగర నిజం

| సంపుటి : 13 | సంచిక :358 | ఉమ్మడి రంగారెడ్డి | సంపాదకులు : ఏలె. పురుషోత్తం | 17 మంగళవారం, మార్చి 2026 | పేజీలు : 4+ | ₹ 3 |
|---|---|---|---|---|---|---|
| Volume : 13 | Issue : 358 | Rangareddy | Editor : Yela.Purushotham | 17 Tuesday , MARCH 2026 | Pages : 4 + | Price : 3/- |

Published From Rangareddy,Circulated by Hyderabad, Nalgonda, Khammam, Karimnagar, Warangal, Mahaboobnagar, Medak, Nizamabad, Adilabad

# నికార్సైన హిందువులు మొదటి నుంచి కూడా దళిత సమాజమే


- కాంగ్రెస్ ఎమ్మెల్యే మందుల సామేల్ ప్రవర్తిస్తున్న తీరు హేయనీయం
- బిజెపి ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్
- కాంగ్రెస్ పార్టీలో బ్రాహ్మణులు లేరా? మంత్రులు లేరా?



**హైదరాబాద్ మార్చ్16 (నగరనిజం న్యూస్ )** నికార్సైన హిందువులు, నిజంగా ధర్మాన్ని పాటించే వారు ఎవరు అంటే, మొదటి నుంచి కూడా దళిత సమాజమే ముందుంటుందని బిజెపి ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్ అన్నారు.భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ వారి కుటుంబ సంప్రదాయాలు, పూజా విధానాలు, గ్రామీణ సంస్కృతి పల్లెల్లో పోచమ్మ, మైసమ్మ నుంచి మొదలుకొని ప్రతి ఆరాధనలో దళితుల పాత్ర ఎంతో గౌరవనీయంగా ఉంటుంది. బ్రాహ్మణులను గౌరవించడం గానీ, సమాజంలోని ఇతర వర్గాలను గౌరవించడం గానీ.. సమాజంతో కలిసిమెలిసి జీవించే స్వభావం దళితులదేనన్నారు. అలాంటి దళిత సమాజంలో పుట్టిన వ్యక్తిగా చెప్పుకుంటూ, ఈరోజు కాంగ్రెస్ ఎమ్మెల్యే మందుల సామేల్ ప్రవర్తిస్తున్న తీరు పూర్తిగా అసహజంగా కనిపిస్తోంది. మంత్రి పదవి రాలేదనే అసంతృప్తి, ముఖ్యంగా అడ్లూరి లక్ష్మణ్ గారికి మంత్రి పదవి రావడంతో సామేల్ కునన అసంతృప్తి కారణంగా, ప్రభుత్వం పట్ల, హిందూ సమాజం పట్ల, కాంగ్రెస్ వేదికలనే ఉపయోగించుకొని అసహనం వ్యక్తం చేస్తున్నట్టుగా అనిపిస్తోందన్నారు. మాదిగ సమాజానికి మంత్రి పదవి ఇవ్వాలని కాంగ్రెస్‌లో కొందరు ఎమ్మెల్యేలు కలిసి డిమాండ్ చేసిన విషయం వాస్తవమే. అయితే పార్టీ ప్రాధాన్యతల ప్రకారం లక్ష్మణ్ కుమార్ మంత్రి పదవి ఇచ్చిన తర్వాత నుంచి సామేల్ గారి వ్యవహార శైలి గమనిస్తే, అది ఒక రాజకీయ నాయకుడి సమతుల్యత కంటే వ్యక్తిగత అసంతృప్తి ఆధారంగా నడుస్తున్నట్టు కనిపిస్తోంది. ప్రతి సందర్భంలో హిందూ సమాజం పట్ల, వేదికపై ఉన్న నాయకుల పట్ల నర్మగర్భ వ్యాఖ్యలు చేయడం ఆయన అలవాటుగా మారింది. ఇటీవల కబ్బంపల్లి సత్యనారాయణ గారి ప్రమాణ స్వీకార కార్యక్రమంలో కూడా మరో దళిత నాయకుడు ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంలో అవసరం లేని వ్యాఖ్యలు చేయడం సమాజం మొత్తం గమనించిందని తెలిపారు. ఆయన వ్యాఖ్యలపై సమాజంలో తీవ్ర అసంతృప్తి ఉంది. తన నియోజకవర్గ ప్రజలే భవిష్యత్తులో సరైన బుద్ధి చెబుతారని అక్కడి ప్రజల్లో చర్చ జరుగుతోంది. అదే ప్రాంతం నుంచి వచ్చిన కొందరు నాయకులు కూడా ఇలాంటి అసహనంతో మాట్లాడటం దురదృష్టకరం. ఒకరికి ఎమ్మెల్యే టికెట్ రాలేదని, ఇంకొకరికి మంత్రి పదవి రాలేదని, ఆ అసంతృప్తిని బిజెపి మీద గానీ, హిందుత్వం మీద గానీ, బ్రాహ్మణ సమాజం మీద గానీ చూపించడం సరైంది కాదన్నారు.కాంగ్రెస్ పార్టీ టికెట్‌పై గెలిచిన దళిత ఎమ్మెల్యేలు ముందు తమ సమాజానికి ఇచ్చిన హామీల గురించి మాట్లాడాలి. రాష్ట్రవ్యాప్తంగా దళితుల కోసం తీసుకున్న దరఖాస్తులు, ప్రకటించిన రూ.5 లక్షల ఆర్థిక సహాయం, రాజీవ్ యువ వికాసం వంటి పథకాలు.. ఇవన్నీ ఏ దశలో ఉన్నాయి? దరఖాస్తులు కలెక్టరేట్లలో పేరుకుపోయాయి కానీ లబ్ధిదారులకు సహాయం అందడం లేదు. బడ్జెట్‌లో దళితుల కోసం కేటాయించిన నిధులు ఎక్కడ వినియోగమవుతున్నాయి? ఎందుకు ఖర్చు కాకుండా సరెండర్ అవుతున్నాయి? రాబోయే బడ్జెట్ సమావేశాల్లో ఈ విషయాలపై దళిత ఎమ్మెల్యేలు మాట్లాడాలని కుమార్ డిమాండ్ చేసారు.దళిత సమాజం ముందుకు వెళ్లి, తమ హామీలు నెరవేర్చలేకపోయినందుకు క్షమాపణ చెప్పాల్సిన బాధ్యత కాంగ్రెస్ దళిత ఎమ్మెల్యేలపై ఉంది. దళితుల అభివృద్ధి కోసం, వారికి ప్రకటించిన పథకాల కోసం ప్రభుత్వం దగ్గర పోరాడకుండా, దారి మళ్లించి ఇతర అంశాలపై మాట్లాడటం సమంజసం కాదు. ఏ సమాజం నుంచి గెలిచి వచ్చారో, ఆ సమాజం కోసం ముందుగా ప్రభుత్వాన్ని ప్రశ్నించాలి. మీ నియోజకవర్గంలో ఎంతమందికి రుణాలు వచ్చాయి? ఎంతమంది దరఖాస్తుదారులకు సహాయం అందింది? ఈ లెక్కలు ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేసారు. ఇంకొకరికి పదవి వస్తే అసహనం, ఇంకొకరికి మంత్రి పదవి వస్తే అసంతృప్తి ఈ వ్యక్తిగత అసంతృప్తిని సమాజంలో పెద్ద అంశంగా చూపించాలనుకోవడం రాజకీయ పరిపక్వత కాదు. అందుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దళిత సమాజానికి ప్రభుత్వం ఏమి చేసిందో వైట్ పేపర్ విడుదల చేయాలని డిమాండ్ చేసారు. అలాగే ఇలాంటి వ్యాఖ్యలు చేసిన వారిపై కనీసం షోకాజ్ నోటీసులు ఇవ్వాలి. కాంగ్రెస్ పార్టీలో బ్రాహ్మణులు లేరా? మంత్రులు లేరా? ప్రభుత్వం లోపలే అనేక విభేదాలు, వాటాలపై గొడవలు జరుగుతున్న దృశ్యాలు ప్రజలందరూ చూశారు. అలాంటి పరిస్థితిలో సమాజానికి ఏమి చేస్తారు? ఇచ్చిన 420 హామీల్లో నాలుగు కూడా సక్రమంగా అమలు కాలేదనే భావన ప్రజల్లో ఉందమన్నారు. సామేల్ లాంటి వారు నిజంగా దళిత సమాజం నుంచి వచ్చామని భావిస్తే, ముందుగా తమ ప్రభుత్వాన్ని ప్రశ్నించాలి. ఆశీర్వదించడానికి వచ్చిన వారిని విమర్శించడం కాదు; సమాజ ప్రయోజనాల కోసం మాట్లాడాలన్నారు.ఈ మీడియా సమావేశంలో బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి కప్పర ప్రసాద్ బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కాంతికిరణ్ , బిజెపి రాష్ట్ర కార్యదర్శి కొప్పు భాషా , మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు , బిజెపి ధార్మిక సెల్ కన్వీనర్ సూర్యప్రకాష్ తక్కితరులు పాల్గొన్నారు. పాల్గొన్నారు.'

## జానకంపేట్ మల్లికార్జున స్వామి ఉత్సవాల్లో పాల్గొన్న పటాన్చెరు నియోజకవర్గ బిఆర్ఎస్ ఇంచార్జ్ ఆదర్శ్ రెడ్డి





**నగర నిజం మార్చి 16 సంగారెడ్డి జిల్లా :** అమీన్‌పూర్ డివిజన్ పరిధిలోని జానకంపేట్ గ్రామంలో వెలసిన శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి.ఈ వేడుకల్లో పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వెన్నవరం ఆదర్శ్ రెడ్డి పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.ఆలయానికి విచ్చేసిన ఆదర్శ్ రెడ్డి కి గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ వారు ఆదర్శ్ రెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో జానకంపేట్ మాజీ సర్పంచ్ పందు యాదవ్, కిష్టారెడ్డిపేట్ మాజీ సర్పంచ్ కృష్ణ, వడిగేపల్లి మాజీ సర్పంచ్ మల్లేష్ పాల్గొన్నారు. అలాగే బీఆర్ఎస్ యువ నాయకులు మాణిక్ యాదవ్, సాయి కృష్ణ, శివతో పాటు స్థానిక నాయకులు, పెద్ద సంఖ్యలో భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు. భక్తుల కోలాహలంతో జానకంపేట్ గ్రామం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

## ఉద్యమంలో లేని రేవంత్ రెడ్డి తెలంగాణ చరిత్రను రూపుమాపే దుస్సాహసం చేస్తున్నడు

- మేం అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ తల్లి విగ్రహాన్ని సగౌరవంగా గాంధీ భవన్ కు తరలిస్తాం
- బతుకమ్మ లేని తెలంగాణ తల్లి విగ్రహం తెలంగాణ ఆత్మకు ప్రతిరూపం కానే కాదు
- శాసనసభ ఆవరణలో గవర్నర్ ఆవిష్కరించిన తెలంగాణ తల్లి మన తల్లికాదు
- అధికారంలోకి వచ్చాక అసెంబ్లీలో ఉద్యమ తెలంగాణ తల్లి విగ్రహం ప్రతిష్టిస్తాం
- విశారదన్ మహారాజ్ అరెస్ట్ అక్రమం.. వెంటనే విడుదల చేయాలి.



**హైదరాబాద్ మార్చ్ 16 (నగర నిజం న్యూస్);** తెలంగాణ ఉద్యమంలో లేని రేవంత్ రెడ్డి తెలంగాణ చరిత్రను రూపుమాపే దుస్సాహసం చేస్తున్నారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఒక ప్రకటనలో మండిపడ్డారు. చరిత్ర నిర్మాణంలో పాల్గొనని వారు మొదట చేయాలనుకునే పనే చరిత్రను చెరిపివేయడం అన్నారు. అది కుదరకపోతే చరిత్రను వక్రీకరించే ప్రయత్నం చేస్తారని చెప్పారు. తెలంగాణలో రేవంత్ రెడ్డి కూడా అదే పనిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ శాసన సభ ప్రాంగణంలో ఈరోజు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆవిష్కరించిన తెలంగాణ తల్లి విగ్రహంపై స్పందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టించిన ఆ విగ్రహం తెలంగాణ చరిత్రను అవమానించేలా ఉందన్నారు. బతుకమ్మ లేకుండా ఉన్న తెలంగాణ తల్లి విగ్రహం తెలంగాణ ఆత్మకు ఎంతమాత్రం కూడా ప్రతిరూపం కాదని చెప్పారు. సమస్త తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ అని అన్నారు. తమ మూలాలను మదిలో తలుస్తూ తెలంగాణ బిడ్డలంతా కూడా ఉద్యమ సందర్భంలో తెలంగాణ తల్లికి అపురూపంగా ఇచ్చిన రూపమే బతుకమ్మతో కూడిన తెలంగాణ తల్లి అని స్పష్టం చేశారు. రాష్ట్రోద్యమ కాలంలో ఏర్పరచుకున్న తల్లి రూపురేఖలు మార్చడం, ఉద్యమ గుర్తులను చెరిపేయటమంటే అది మూర్ఖపు పనేనని ఆమె అన్నారు. తనకు స్థానం లేని ఉద్యమ చరిత్రను రూపుమాపుతున్నానని భ్రమిస్తూ రేవంత్ రెడ్డి అల్ప సంతోషంలో ఉన్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లో బతుకమ్మ లేని తెలంగాణ తల్లిని అంగీకరించేది లేదని స్పష్టం చేశారు. తాము అధికారంలోకి వచ్చాక... అమరుల త్యాగాలను ఒడిసి పట్టుకున్న నాటి ఉద్యమ తెలంగాణ తల్లిని అదే చోట ప్రతిష్టిస్తామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టించిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని సగౌరవంగా కాంగ్రెస్ కు ఆఫీస్ కు తరలిస్తామని తేల్చిచెప్పారు.

### విశారదన్ మహారాజ్ అరెస్ట్ అక్రమం

ఖమ్మం వెలుగుమట్ల బాధితులకు అండగా నిలిచేందుకు వెళ్లిన ధర్మ సమాజ్ పార్టీ అధ్యక్షుడు విశారదన్ మహరాజ్ ను పోలీసులు అరెస్ట్ చేయటాన్ని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఖండించారు. ఈ అరెస్ట్ అక్రమమని అన్నారు. అరెస్ట్ చేసిన విశారదన్ మహరాజ్ ను పలు స్టేషన్లకు తిప్పుతూ ఇబ్బంది పెట్టటం దారుణమన్నారు. వెంటనే ఆయనను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

### తెలంగాణకే గర్వకారణం

ప్రముఖ కవి, అధ్యాపకులు నందిని సిధారెడ్డి గారికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు రావటం ఎంతో సంతోషానిచ్చిందని జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. తెలంగాణ భావజాల వ్యాప్తి కోసం కృషి చేసిన ఆయనకు ఈ అవార్డు రావటం తెలంగాణకే గర్వకారణమని చెప్పారు. వచన కవిత్వ విభాగంలో నందిని సిధారెడ్డి గారు రచించిన "అనిమేష" కవితా సంపుటికి పురస్కారం లభించడం అభినందనీయమన్నారు. ఆయన కలం నుంచి మరిన్ని మంచి రచనలు రావాలని ఆకాంక్షిస్తున్నామని పేర్కొన్నారు.

## ఇంద్రేశం ఆక్రమ నిర్మాణాలపై ప్రజావాణిలో ఫిర్యాదు

- తక్షణ చర్యలకు ఆదేశం



**నగర నిజం మార్చి16** సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలోని ఇంద్రేశం మున్సిపాలిటీలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై జిల్లా యంత్రాంగం దృష్టి సారించింది. సోమవారం ఉదయం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమంలో ఇంద్రేశం పరిధిలోని పలు ఆక్రమణలపై జర్నలిస్ట్ విజయ్ కుమార్ ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా, అనుమతులు లేకుండా జరుగుతున్న నిర్మాణాల వల్ల ఎదురవుతున్న ఇబ్బందులను విజయ్ కుమార్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ ఫిర్యాదులపై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. ప్రజావాణికి వచ్చే ఫిర్యాదుల పట్ల అలసత్వం వహించరాదని, క్షేత్రస్థాయిలో విచారణ జరిపి వెనువెంటనే సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

## అసెంబ్లీలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించిన గవర్నర్

**హైదరాబాద్, నగరనిజం:** భవిష్యత్తులో ఒక చారిత్రాత్మక క్షణానికి సాక్ష్యంగా నిలిచిం ది. తె లం గాణ జాతి గౌరవం, ఆత్మగౌరవం, సంస్కృతి, అస్తి త్వానికి ప్రతీకగా ని లిచే శక్తి స్వరూపిణి తెలంగాణ త ల్లి విగ్రహం అక్కడ గర్వంగా నిలి చింది. ఆ మహత్తర విగ్రహాన్ని రా ష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా ము ఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డితో కలిసి ఘనంగా ఆవిష్కరించారు.బడ్జెట్ సమావేశాల ప్రారంభ రోజున సోమ వారం జరిగిన ఈ వేడుక శాసనస భ చరిత్రలో ఒక ప్రత్యేక ఘట్టంగా నిలిచింది.ఈ కార్యక్రమానికి ముందు గవర్న ర్, ముఖ్యమంత్రితో కలిసి అసెంబ్లీ ప్రాంగణంలోని మహాత్మా గాంధీ వి గ్రహానికి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గారి విగ్రహానికి పుష్పాంజలి ఘటించా రు. అనంతరం పునరుద్ధరిం చబడిన శాసనమండలి భవ నం ఎదుట ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవి ష్కరించి నివాళులు అర్పించారు.

## టీపీసీసీ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఎర్రబెల్లి స్వర్ణకు శుభాకాంక్షలు తెలిపిన 'కళ్లెం సుజాత రెడ్డి'





**హయత్ నగర్, మార్చి 16 (నగర నిజం)** 'టీపీసీసీ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఎర్రబెల్లి స్వర్ణ' పదవీ బాధ్యతలు స్వీకరణ కార్యక్రమానికి "కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు కళ్లెం సుజాత రెడ్డి" హాజరయ్యారు. ఈ సందర్భంగా సుజాత రెడ్డి, ఎర్రబెల్లి స్వర్ణకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరించిన ఎర్రబెల్లి స్వర్ణకు అభినందనలు తెలిపారు. మహిళా కాంగ్రెస్ రాష్ట్రంలో మహిళల సమస్యలను ప్రస్తావించే కీలక వేదికగా నిలుస్తోందన్నారు. ఎర్రబెల్లి స్వర్ణ నాయకత్వంలో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ మరింత బలోపేతం అవుతూ మహిళల సమస్యల పరిష్కారానికి బలమైన స్వరంగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## సుధీర్ రెడ్డి చొరవతో చెరువుల్లో గుర్రపుడెక్క ఆకుల తొలగింపు ప్రారంభం



**ఎల్.బి.నగర్, మార్చి 16 (నగర నిజం):** ఎల్.బి.నగర్ నియోజకవర్గ పరిధిలోని పలు చెరువులు గుర్రపుడెక్క ఆకులతో నిండిపోవడంతో దోమల సమస్య తీవ్రంగా ఉందని స్థానికులు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆయన వెంటనే స్పందించి గత శుక్రవారం నియోజకవర్గంలోని మాన్సూరాబాద్ పెద్ద చెరువు, హయత్‌నగర్ కుమ్మరికుంట చెరువులను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీవాసులతో మాట్లాడిన సుధీర్ రెడ్డి గుర్రపుడెక్క ఆకులను రెండు మూడు రోజుల్లో పూర్తిగా తొలగించే చర్యలు చేపడతామని భరోసా ఇచ్చారు. ఆయన ఇచ్చిన హామీ మేరకు అధికారులు వెంటనే అప్రమత్తమై హయత్‌నగర్ కుమ్మరికుంట చెరువులో పేరుకుపోయిన గుర్రపుడెక్క ఆకుల తొలగింపు పనులను ప్రారంభించారు. స్థానిక జీహెచ్ఎంసీ ఎంటమాలజిస్ట్ సిబ్బంది పర్యవేక్షణలో చెరువులోని గుర్రపుడెక్క ఆకులను తొలగించే పనులు కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమం పూర్తయిన అనంతరం కాలనీల్లో ఫాగింగ్ కార్యక్రమం కూడా చేపడతామని అధికారులు తెలిపారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో సుధీర్ రెడ్డి అసెంబ్లీకి హాజరవ్వాల్సి రావడంతో ఈ పనులను ప్రత్యక్షంగా పర్యవేక్షించలేకపోతున్నప్పటికీ, ప్రజా సమస్యల పరిష్కారంపై నిరంతరం దృష్టి సారిస్తున్నారని స్థానికులు పేర్కొన్నారు. అధికారంలో ఉన్నా లేకపోయినా ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు అహర్నిశలు కృషి చేస్తున్న సుధీర్ రెడ్డి సేవలను వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో హయత్‌నగర్ భారస పార్టీ అధ్యక్షుడు చెన్నగొని శ్రీధర్ గౌడ్, సీనియర్ నాయకులు భాస్కర్ సాగర్, గోరిగే ప్రదీప్, అధికారులు నీలిమ, దీపక్, విజయలక్ష్మి, బలరాం, బిక్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# రంజాన్ వేళ మానవత్వాన్ని చాటుకున్న మాజీ కౌన్సిలర్ జహంగీర్ ఖాన్





- 350 మంది పారిశుద్ధ్య కార్మికులకు కొత్త బట్టలు పెట్టిన మహమ్మద్ జహంగీర్ ఖాన్ కుటుంబం
- పారిశుద్ధ్య కార్మికులు దేవుళ్లతో సమానమన్న జహంగీర్ ఖాన్

**రాజేంద్రనగర్, మార్చి 16 (నగరనిజం ప్రతినిధి):** రంజాన్ మాసం వేళ గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ పరిధిలోని శంషాబాద్ కు చెందిన మాజీ కౌన్సిలర్ మహమ్మద్ జహంగీర్ ఖాన్ మానవత్వాన్ని చాటుకున్నారు. పండుగ వేళ పారిశుద్ధ్య కార్మికుల కుటుంబాల ముఖాల్లో వెలుగులు చూడాలని పరితపించే జహంగీర్ ఖాన్.... దాదాపు 350 మంది జిహెచ్ఎంసీ పారిశుధ్య కార్మికులకు కొత్త దుస్తులు పెట్టారు. పారిశుద్ధ్య కార్మికులు దేవుళ్ళతో సమానమని పేర్కొంటూ కుటుంబ సభ్యులతో కలిసి వారికి చీరే, సారే పెట్టి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మున్సిపల్ పరిధిలోని అక్బర్ కాలనీకి చెందిన మాజీ కౌన్సిలర్ మహమ్మద్ జహంగీర్ ఖాన్.... ప్రతి ఏటా రంజాన్ మాసంలో మానవత్వాన్ని చాటుకుంటారు. పండుగ వేళ తమ కుటుంబంతో పాటు పారిశుద్ధ్య కార్మికుల సైతం సంతోషంగా ఉండాలని కోరుకునే జహంగీర్ ఖాన్.... ప్రతి ఏడాది రంజాన్ మాసంలో పండుగకు ఒకరోజు ముందు పారిశుద్ధ్య కార్మికులందరికీ కొత్త దుస్తులు పెట్టడం అలవాటుగా మార్చుకున్నారు. ఈ క్రమంలో ఈ ఏడాది రంజాన్ పండుగను పురస్కరించుకొని గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ శంషాబాద్ సర్కిల్ లోని 350 మంది పారిశుద్ధ్య కార్మికులను తన నివాసానికి ఆహ్వానించి వారికి కొత్త దుస్తులు పెట్టారు. కుటుంబ సభ్యులతో కలిసి పారిశుద్ధ్య కార్మికులకు కొత్త దుస్తులు పంపిణీ చేసిన జహంగీర్ ఖాన్.... పారిశుద్ధ్య కార్మికులు దేవుళ్ళతో సమానం అంటూ వారి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన మహమ్మద్ జహంగీర్ ఖాన్.... పారిశుధ్య కార్మికులు లేకుంటే శంషాబాద్ మొత్తం దుర్గంధం తో నిండిపోతుంది అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో దేవుళ్ళ లాంటి పారిశుద్ధ్య కార్మికులను గౌరవించాలనే లక్ష్యంతో ప్రతి ఏటా రంజాన్ మాసంలో తమ కుటుంబ సభ్యులతో సమానంగా వారికి కొత్త దుస్తులు కోనిపెట్టడం అలవాటుగా మార్చుకున్నామని ప్రకటించారు. గడిచిన 20 ఏళ్లుగా ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు జహంగీర్ ఖాన్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ జహంగీర్ ఖాన్ తో పాటు స్థానిక నేతలు మహమ్మద్ ఇర్ఫాన్ ఖాన్, మహమ్మద్ ఇమ్రాన్ ఖాన్, అస్లం ఖాన్, జునేద్ అక్బర్ ఖాన్, సోహెల్, సయ్యద్ భాయ్, సలీం భాయ్, మౌలానా, సల్మాన్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### జహంగీర్ ఖాన్ కు కృతజ్ఞతలు తెలిపిన పారిశుధ్య కార్మికులు

ప్రతి ఏడాది రంజాన్ మాసంలో తమను కుటుంబ సభ్యులుగా భావించి కొత్త దుస్తులు పెడుతున్న మాజీ కౌన్సిలర్ జహంగీర్ భాయ్ కి పారిశుద్ధ్య కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు. వారి కుటుంబంలో ఒకరిగా తమను తమను గౌరవిస్తూ ప్రతి ఏటా కొత్త దుస్తులు పెట్టడంతో పాటు ఆపదలో ఆదుకునే ఆపద్బాంధవుడని పారిశుధ్య కార్మికులు పేర్కొన్నారు. జహంగీర్ ఖాన్ కుటుంబానికి తాము రుణపడి ఉంటామని వారు చెప్పారు.

# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి





- ప్రజావాణికి 119దరఖాస్తులు
- జిల్లా కలెక్టర్ దీపక్ తివారి

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి మర్చి 16నగర నిజం :** వికారాబాద్ జిల్లాలోని సుదూర ప్రాంతాల నుండి సమస్యల పరిష్కారం కొరకు వస్తారని, వారి ఫిర్యాదులను పూర్తి స్థాయి లో పరిశీలించి పెండింగ్ ఉంచకుండా సత్వరమే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి 119 పిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లాకలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులు పరిష్కరించడం అధికారుల బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజావాణిలో వచ్చే ప్రతి దరఖాస్తును అధికారులు జాగ్రత్తగా చదివి, అందులో పేర్కొన్న సమస్యలను పూర్తిగా అర్థం చేసుకుని, అవసరమైన విచారణ జరిపి సరైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదులను పెండింగ్ ఉంచకుండా నిర్ణీత కాలంలో పరిష్కరించి స్పష్టమైన నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల వారిగా మున్సిపాలిటీలు, పంచాయతీ రాజ్, అటవీ శాఖ, డీఆర్‌డీఏ, ప్రణాళిక శాఖ, భూ సేకరణ విభాగాలకు చెందిన అధికారుల వద్ద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై వివరణ ఇవ్వాలని కోరారు. వారంలోపు అన్ని పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించి, గత వారం అందిన దరఖాస్తుల సంఖ్య, పరిష్కరించినవి, ఇంకా పెండింగ్‌లో ఉన్నవి వంటి వివరాలతో కూడిన సమగ్ర నివేదికను స్పష్టమైన నమూనాలో సమర్పించాలని అధికారులకు ఆదేశించారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంపై అధికారులతో మాట్లాడుతూ గ్రామ పంచాయతీ, మండల, మున్సిపాలిటీ, జిల్లా స్థాయిలో రోజువారీ షెడ్యూల్ ప్రకారం ప్రజలు,.ప్రజా ప్రతినిధులునిర్వహించిన కార్యక్రమాలను తప్పని సరిగా ఫోటోలు పంపించాలని సూచించారు. ప్రతి రోజూ చేపట్టిన కార్యక్రమాలకు సంబంధించిన ఫోటోలు , వివరాలను కార్యక్రమం అనంతరం జిల్లా అధికారుల వాట్సాప్ గ్రూపులో అప్లోడ్ చేయాలని, ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, ట్రైనీ కలెక్టర్ హార్స్ చౌదరి జడ్.పి సి ఇ ఓ సుధీర్,ఆర్ డి ఓ వాసు చంద్ర,ఇతర శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలి







- మాజీ కౌన్సిలర్ జహంగీర్ ఖాన్
- మానవతా దృక్పథంతో పారిశుద్ధ్య కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని సీఎం రేవంత్ రెడ్డికి జహంగీర్ ఖాన్ విజ్ఞప్తి

**రాజేంద్రనగర్, మార్చి 16 (నగరనిజం ప్రతినిధి):** గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ పరిధిలోని శంషాబాద్ జోన్ లో పనిచేస్తున్న స్థానిక పారిశుద్ధ్య కార్మికులను తక్షణమే పర్మినెంట్ చేయాలని మాజీ కౌన్సిలర్, కాంగ్రెస్ నేత మహమ్మద్ జహంగీర్ ఖాన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మానవతా దృక్పథంతో ఆలోచించి పారిశుద్ధ్య కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. సోమవారం నాడు శంషాబాద్ లో మీడియాతో మాట్లాడిన మాజీ కౌన్సిలర్ జహంగీర్ ఖాన్.... పారిశుద్ధ్య కార్మికులు లేకపోతే గ్రామాలు కళ తప్పి పోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాణాలకు తెగించి పారిశుద్ధ్య కార్మికులు పారిశుద్ధ్యం పనులు చేపట్టడం వల్లనే ప్రజలనుతా సంతోషంగా ఉండగలుగుతున్నారని ఆయన అభిప్రాయపడ్డారు. ఎండనకా, వాననకా పారిశుద్ధ్య కార్మికులు నిరంతరం మురికి కూపం లో మగ్గుతున్నారని, విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన కార్మికులకు దిక్కు లేకుండా పోతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. శంషాబాద్ మున్సిపాలిటీగా అవతరించిన నాటి నుండే పారిశుద్ధ్య కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని తాను వారి పక్షాన పోరాటం కొనసాగిస్తున్నట్లు జహంగీర్ ఖాన్ వివరించారు. ఇటీవల విధి నిర్వహణలో పారిశుధ్య కార్మికులు మృతి చెందితే వారిని ఆదుకునే దిక్కే లేరని ఆయన వాపోయారు. ప్రాణాలకు తెగించి ప్రజలను మురికి కూపం నుంచి కాపాడుతున్న పారిశుధ్య కార్మికులు దేవుళ్ళతో సమానమని జహంగీర్ ఖాన్ అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో శంషాబాద్ సర్కిల్ కు చెందిన జీహెచ్ఎంసీ కార్మికులను తక్షణమే రెగ్యులరైజ్ చేయాలని జహంగీర్ ఖాన్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయే పారిశుద్ధ్య కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. శంషాబాద్ లోని జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య కార్మికులను రెగ్యులరైజ్ చేసే వరకు తన పోరాటం కొనసాగుతుందని జహంగీర్ ఖాన్ ప్రకటించారు. కార్మికుల సమస్యల పరిష్కారం అయ్యేంతవరకు వారికి తాను అండగా ఉంటాడని భరోసా ఇచ్చారు.

# ఎస్‌కే డి నగర్‌లో రూ.29 లక్షల సీసీ రోడ్ల పనులపై పరిశీలన



**ఎల్.బి.నగర్, మార్చి 16 (నగర నిజం):** బి.యన్. రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని ఎస్‌కే డి నగర్ కాలనీలో నూతన సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.29 లక్షలు మంజూరు చేయించగా, గుత్తేదార్ నిర్లక్ష్యంతో పనులు ఆలస్యం అవుతున్నాయని కాలనీవాసులు జీహెచ్ఎంసీ మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన మొద్దు లచ్చి రెడ్డి సంబంధిత ఇంజనీరింగ్ విభాగం డీఈ కనకయ్య, ఏఈ విగ్నేశ్వరితో కలిసి కాలనీలో రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు గుత్తేదార్ కారణంగా పనులు ఆలస్యమవుతున్నాయని వివరించారు. దీనిపై సంబంధిత అధికారులతో మాట్లాడిన లచ్చి రెడ్డి వీలైనంత త్వరగా రోడ్డు పనులను ప్రారంభించాలని సూచించారు. అలాగే రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు తప్పకుండా పాటిస్తూ, లెవెల్స్ సరిచూసుకుంటూ కాలనీవాసులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పనులు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రధాన కార్యదర్శి శ్రీధర్ రావు, కో-కన్వీనర్ రఘురాం నేత, ట్రెజరర్ కృష్ణారావు, కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు శ్రీనివాసరావు, లక్ష్మీనరసింహస్వామి ఆలయ సెక్రటరీ కాంతారావు, కార్యవర్గ సభ్యులు వెంకట్ రెడ్డి, ప్రవీణ్ గౌడ్, కాలనీ సభ్యులు వీరారెడ్డి, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నగరనిజం



# యుద్ధం పై మోడీ మౌనం వీడాలి






- సీపీఐ రాష్ట్ర నేత పానుగంటి పర్వతాలు
- ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా యుద్ధాన్ని నిరసిస్తూ శంషాబాద్ లో సీపీఐ ఆందోళన
- హైదరాబాద్ బెంగళూరు జాతీయ రహదారిపై బైఠాయించి రాస్తారోకో
- పానుగంటి పర్వతాలు సహా కమ్యూనిస్టు నేతలను అరెస్టు చేసిన పోలీసులు

**రాజేంద్రనగర్, మార్చి 16 (నగరనిజం ప్రతినిధి):** ఇరాన్ పై ఇజ్రాయిల్ అమెరికా కొనసాగిస్తున్న యుద్ధాన్ని తక్షణమే విరమించాలని భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతాలు డిమాండ్ చేశారు. యుద్ధం వల్ల పెట్రోల్, డీజిల్ కొరతతో పాటు గ్యాస్ సమస్యలు దేశ ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ తక్షణమే జోక్యం చేసుకొని యుద్ధం విరమణ కోసం అమెరికాపై ఒత్తిడి తేవాలని పానుగంటి పర్వతాలు డిమాండ్ చేశారు. ఇరాన్ ఇజ్రాయిల్, అమెరికా యుద్ధాన్ని నిరసిస్తూ సోమవారం నాడు హైదరాబాద్ శివారులోని శంషాబాద్ అంబేద్కర్ చౌరస్తా వద్ద సీపీఐ మండల కార్యదర్శి నర్రాగిరి ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. హైదరాబాద్ బెంగళూరు జాతీయ రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సీపీఐ రాష్ట్ర నేత పానుగంటి పర్వతాలు.... అమెరికా యుద్ధ నీతిని తీవ్రంగా ఖండించారు. ఇజ్రాయిల్, అమెరికా దేశాలు ఇరాన్ పై ముప్పేట దాడిని కొనసాగిస్తున్న నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా శాంతికి భంగం కలుగుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. యుద్ధం నేపథ్యంలో ఇప్పటికే క్రూడ్ ఆయిల్ ధరలు భగ్గున మండే పరిస్థితి నెలకొందని, గ్యాస్ కొరతతో ప్రజలు అల్లాడుతున్నారని పానుగంటి పర్వతాలు ఆందోళన వ్యక్తం చేశారు. గ్యాస్ కొరతతో ప్రజలు అల్లాడుతుంటే నరేంద్ర మోడీ ప్రభుత్వం అదేమీ లేదన్నట్లుగా సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని ఆయన విమర్శించారు. అమెరికా ధన దాహానికి పేద దేశాలు అల్లాడిపోతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికా యుద్ధోన్మాదాన్ని వ్యతిరేకిస్తూ ప్రపంచ దేశాలన్నీ ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైందని పానుగంటి పర్వతాలు అభిప్రాయపడ్డారు. యుద్ధం ప్రభావం దేశ ప్రజలపై పడే అవకాశం ఉన్నందున ప్రధాని నరేంద్ర మోడీ ఇప్పటికైనా మౌనం విడాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రపంచ శాంతి కోసం ప్రధాని నరేంద్ర మోడీ తక్షణమే జోక్యం చేసుకొని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తో చర్చించాలని పానుగంటి పర్వతాలు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా అమెరికా ఇజ్రాయిల్ దేశాలకు వ్యతిరేకంగా సీపీఐ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. హైదరాబాద్ బెంగళూరు జాతీయ రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు ఆందోళన కారులను అరెస్టు చేసి శంషాబాద్ ఆర్.జి.ఐ.ఏ పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా నేత రాచమల్ల యాదగిరి, సీపీఐ శంషాబాద్ మండల కార్యదర్శి నర్రాగిరి, ఏఐటియుసి మండల కార్యదర్శి గిలక రాజు, భవన నిర్మాణ కార్మిక సంఘం నేత శ్రీను, ఏఐటీయూసీ నాయకులు ప్రవీణ్ కుమార్ గౌడ్, నరేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## మొగిలిపాకలో అంగరంగ వైభవంగా మల్లికార్జున స్వామి కళ్యాణం

- పాల్గొన్న కాంగ్రెస్ జిల్లా నాయకులు మామిడి సత్తిరెడ్డి కుటుంబ సభ్యులు



**వలిగొండ మార్చి 15:( నగర నిజం)** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని మొగిలిపాక గ్రామంలో శ్రీశ్రీ భ్రమరాంబ కేతమ్మ సహిత మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సవం, శ్రీ ఎల్లమ్మ మైసమ్మ కళ్యాణోత్సవం యాదవ సంఘం ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు.కళ్యాణ మహోత్సవం సందర్భంగా అగ్నిగుండం, హోమగుండం ఏర్పాటు చేసి సాంప్రదాయ బద్ధంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు ఓడిబియాలు సమర్పించి అమ్మవారికి భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో భక్తి వాతావరణం నెలకొంది.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మామిడి సత్తిరెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే మర్ల మల్లేశం కుటుంబ సభ్యులు, జడిగే వెంకన్న కుటుంబ సభ్యులు, సింగం శ్రీను కుటుంబ సభ్యులు, జరిగే నర్సింహ కుటుంబ సభ్యులు, జడిగే నవనీత కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి ఆశీస్సులు పొందారు.

## వలిగొండ నర్సరీని ఎంపీడీఓ జలందర్ రెడ్డి సందర్శన మొక్కల సంరక్షణపై ప్రత్యేక సూచనలు



**వలిగొండ, మార్చి 16:( నగర నిజం):** వలిగొండ గ్రామంలోని నర్సరీని సోమవారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) జి. జలందర్ రెడ్డి సందర్శించి అక్కడ జరుగుతున్న మొక్కల పెంపకం పనులను పరిశీలించారు. నర్సరీలో పెంచుతున్న మొక్కల పరిస్థితిని ఆయన అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా వేప, రేగి మొక్కల పెంపకంపై వివరాలు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.గ్రామంలో చేపట్టనున్న వృక్షారోపణ కార్యక్రమాలకు అవసరమైన మొక్కలను సమయానికి సిద్ధం చేయాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. వేసవి కాలం ప్రారంభమైన నేపథ్యంలో రాబోయే రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉన్నందున నర్సరీలో ఉన్న మొక్కలకు తగిన నీరు అందిస్తూ ప్రత్యేక శ్రద్ధతో సంరక్షణ చేయాలని ఎంపీడీఓ సూచించారు. మొక్కలు ఎండకు గురికాకుండా అవసరమైన నీడ ఏర్పాట్లు చేయడంతో పాటు సకాలంలో నీరు పట్టాలని తెలిపారు.నర్సరీలో పెంచుతున్న ప్రతి మొక్క ఆరోగ్యంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, తద్వారా భవిష్యత్తులో చేపట్టే వృక్షారోపణ కార్యక్రమాలు విజయవంతం అవుతాయని పేర్కొన్నారు. అలాగే నర్సరీలో పెంచుతున్న వేప, రేగి మొక్కలను గ్రామంలోని ప్రతి ఇంటికీ పంపిణీ చేస్తే గ్రామంలో పచ్చదనం పెంపొందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా తోడ్పాటు అందుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో వలిగొండ గ్రామ సర్పంచ్ వెంకటపాపిరెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ మరియు గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## 40 ఏళ్ల చరిత్ర తిరగరాసిన ఎమ్మెల్యేకుంభం అనిల్ కుమార్ రెడ్డి.

- బునాది గాని చెరువులోకి గోదావరి నీళ్లు తెచ్చిన ఘనత కుంభం.



**వలిగొండ మార్చి 16.( నగర నిజం,)** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలో ఉన్న కంచనపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మీడియాతో మాట్లాడుతూ.బునాది గాని చెరువు లోకీ గోదావరి నీళ్లు తెచ్చిన ఘనత భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి కి దక్కిందనీ.40 సంవత్సరాల చెరిత్ర తిరుగరాసి కాంగ్రెస్ పార్టీ జెండా భువనగిరి కిలా మీద కాంగ్రెస్ జెండా ఎగురావేసినారనీ, మీడియా ద్వారా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేగల అంజయ్య యాదవ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కంచనపల్లి యూత్ అధ్యక్షులు జక్క జంగారెడ్డి పాల్గొని మాట్లాడినారు.

## రైజింగ్ దిశగా అడుగులేస్తున్న తెలంగాణ

- 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యం
- ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగుతోంది
- ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు జిహెచ్ఎంసి విభజన
- ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ శివప్రతాప్ శుక్లా తొలి ప్రసంగం



**హైదరాబాద్ మార్చ్ 16 (నగరనిజం న్యూస్ );:** దేశానికి దిక్సూచీగా మన రాష్ట్రం నిలుస్తుందని గవర్నర్ శివప్రతాప్ శుక్లా కొనియాడారు. 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యం అని అన్నారు. తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం అయ్యాయి. ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ శివప్రతాప్ శుక్లా తొలి ప్రసంగం చేశారు. తెలంగాణ రైజింగ్ దిశగా అడుగులేస్తున్నామని, శ్రమించే తత్వంగల శాంతికాముకులు తెలంగాణ ప్రజలు అని తెలియజేశారు. తెలంగాణ పురోగతిలో ప్రతీపౌరుడు భాగస్వామి అని..ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగుతోందని, ఏడాది కాలంలో సంక్షేమ పథకాలు అందరికి అందేలా చర్యలు తీసుకుంటున్నామని, జిహెచ్ఎంసిని మూడు కార్పొరేషన్లుగా, కోర్,ఫ్యూర్, రేర్ గా తెలంగాణను విభజించామని గవర్నర్ పేర్కొన్నారు ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు జిహెచ్ఎంసి విభజన చేశామని, ప్రజలకు భద్రత, రక్షణ కల్పించేలా 4 కమిషనరేట్లు ఏర్పాటు చేశామని అన్నారు. హిల్ట్ పాలసీతో పరిశ్రమ భూముల బదలాయింపు జరిగిందని, మొదటి దశలో హిమాయత్ సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు అభివృద్ధి చేశామని గవర్నర్ అన్నారు. మూసీలో మురుగు నీరు చేరకుండా 39 ఎస్టిపిలు నిర్మాణం జరిగిందని, ఒఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ కు అనుబంధంగా రేడియల్ రోడ్లు నిర్మిస్తామని అన్నారు. 55కి.మీ. మేర మూసీని పునరుజ్జీవింప చేస్తామని, ఫ్యూచర్ సిటీ నుంచి బందర్ పోర్టు వరకు గ్రీన్ ఎక్స్ ప్రెస్ వే, బుల్లెట్ ట్రైన్ కు శంషాబాద్ కు కేంద్రంగా మారబోతోందని గవర్నర్ పేర్కొన్నారు. వరంగల్, అదిలాబాద్ కు ఎయిర్ పోర్టులు రాబోతున్నాయని, గ్లోబల్ సమ్మిట్ తో రూ. 5 లక్షల 72 వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, తెలంగాణను అభివృద్ధిలో గ్లోబల్ హబ్ గా మార్చాలనుకుంటున్నామని గవర్నర్ శివప్రతాప్ శుక్లా స్పష్టం చేశారు. గవర్నర్ ప్రసంగం సమయంలో బిఆర్ఎస్ సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. సభలో నిలబడే బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు గవర్నర్ ప్రసంగాన్నితిలకించారు.

## గ్యాస్ సిలిండర్ల అధిక ధరలు విక్రయిస్తే కస్టమర్లుకు ఇబ్బంది కలిగిస్తే ఎంతటి వారైనా చట్టపరమైన చర్యలు తప్పవు

- జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి



**మహబూబ్నగర్ జిల్లా నగర నిజం మార్చి 16 (ప్రతినిధి ఎర్రమన్న బాలరాజు)జడ్చర్ల, మార్చి 16:** సోమవారం నాడు వంట గ్యాస్ సిలిండర్లను ఎవరైనా బ్లాక్ మార్కెట్లో అధిక ధరలకు విక్రయిస్తే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, అక్రమాలకు పాల్పడిన డీలర్ల డీలర్ షిప్పులను రద్దు చేయిస్తామని, అక్రమాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని జైలుకు పంపుతామని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి హెచ్చరించారు. దీనికి సంబంధించిన ఆధారాలు ఉంటే వాటిని తనకు పంపాలని కోరారు.ఇరాన్-ఇజ్రాయిల్-అమెరికా యుద్ధ నేపథ్యంలో వంట గ్యాస్ సిలిండర్లకు కొరత ఏర్పడిందని ప్రజలు ఆందోళన చెందుతున్న పరిస్థితుల్లో సోమవారం నాడు ఆయన వంట గ్యాస్ సిలిండర్ల కొరతపై జిల్లా సివిల్ సప్లయిస్ అధికారులు, ఎన్ ఫోర్స్ మెంట్ అధికారులతో ఫోన్లో మాట్లాడి ప్రస్తుత పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం వంట గ్యాస్ సిలిండర్లకు కొరత అంటూ ఏమీ లేదని, సిలిండర్లను బుక్ చేసిన వారందరికీ వాటిని సరఫరా చేస్తున్నామని ఈ సందర్భంగా అధికారులు ఎమ్మెల్యేకు తెలిపారు కాగా ముందు సిలిండర్లు దొరకడం కష్టమౌతుందన్న ప్రచారంతో ప్రజలు ఒకేసారి సిలిండర్ల కోసం గ్యాస్ ఏజెన్సీల వద్దకు వచ్చి బారులు తీరుతుండటంతో సిలిండర్లు దొరకడం లేదనే భావన కలుగుతోందని అనిరుధ్ రెడ్డి చెప్పారు. అన్ని ఏజెన్సీల వద్ద కూడా ఇవే పరిస్థితులు కనిపించడం తో ప్రజలు ఆందోళన చెందుతున్నారన్నారు. ఈ పరిస్థితిని ఆసరాగా తీసుకొని కొంత మంది డీలర్లు వంట గ్యాస్ సిలిండర్లను అధిక ధరలకు బ్లాక్ మార్కెట్లో విక్రయిస్తున్నారనే ఫిర్యాదులు కొన్ని తన దృష్టికి వచ్చాయని వెల్లడించారు. ప్రజలు ఇందోళన చెందుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో డీలర్లు ఎవరైనా ఎక్కువ ధరలకు సిలిండర్లు విక్రయిస్తే వారి డీలర్ షిప్పులను రద్దు చేయించడంతో పాటుగా చట్ట ప్రకారంగా వారిపై చర్యలు తీసుకొని తప్పు చేసినట్లుగా తేలిన వారిని జైలుకు పంపిస్తానని హెచ్చరించారు. ప్రజలు కూడా సిలిండర్లను బ్లాక్ లో కొనుగోలు చేసినట్లయితే దానికి సంబంధించిన ఆధారాలు తన దృష్టికి తీసుకురావాలని కోరారు. గ్యాస్ సిలిండర్ల బ్లాక్ మార్కెటింగ్ కు సంబంధించిన ఆధారాలు తనకు నేరుగా పంపాలని, వాటిని తాను అధికారుల దృష్టికి తీసుకెళ్లి అక్రమాలకు పాల్పడిన డీలర్లపై చర్యలు తీసుకొనేలా చూస్తానని అనిరుధ్ రెడ్డి హామీ ఇచ్చారు. మండల స్థాయిలో ఉండే రెవెన్యూ, పోలీసు, సివిల్ సప్లయిస్ అధికారులు వంట గ్యాస్ సిలిండర్ల పంపిణీని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, పరిస్థితులను సమీక్షించి అవసరమైన చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు.

## శివాజీ రైతు గోనె రెడ్డి సంఘం రాయికల్ ఆధ్వర్యంలో తహసీల్దారుకి వినతి



**రాయికల్ మార్చి 16 (నగర నిజం)** ఈరోజు శివాజీ రైతు గోనె రెడ్డి సంఘం రాయికల్ రైతుల ఆధ్వర్యంలో పెండింగ్ లో ఉన్న రైతు భరోసా నిధులు మరియు ఈ యాసంగి పంట రైతు భరోసా నిధులను ఏలాంటి జాప్యం లేకుండా వెంటనే చెల్లించాలని మరియు మండల కేంద్రంలో రెండు మొక్కజొన్న కేంద్రాలను ఏర్పాటు చేయాలని తహసిల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ దేవదాసు గారికి వినతి పత్రం సమర్పించినారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు కుంబల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రైతు భరోసా నిధుల విడుదల జాప్యము కారణంగా రైతులు ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతున్నారని వెంటనే పెండింగ్లో ఉన్నటువంటి మరియు ఈ సీజన్ రైతు భరోసా నిధులను విడుదల చేయాలని అదేవిధంగా రాయికల్ మండల కేంద్రంలో రెండు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరినారు. మండలంలోని రైతులు ఈ సీజన్లో ఎక్కువగా మొక్కజొన్న పంటను సాగు చేసినారు కావున ఎక్కువ పంట దిగుబడి వచ్చేటువంటి అవకాశం ఉన్నందున మరియు రాయికల్ మండలానికి ప్రక్కన ఉన్నటువంటి మండలాలైన మేడిపల్లి, మల్లాపూర్, సారంగాపూర్ మండలాలకు చెందినటువంటి రైతులు కూడా వారు పండించినటువంటి మొక్కజొన్నల కొనుగోలుకు రాయికలకు వస్తున్నారు. కావున ఒక కొనుగోలు కేంద్రము సరిపోక రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. కావున ఈ సీజన్లో రెండు మొక్కజొన్న కేంద్రాలు ఏర్పాటు చేసి తగు సరైన వసతులను కల్పించాలని వారు ప్రభుత్వాన్ని కోరినారు. ఈ కార్యక్రమంలో సంఘం కోశాధికారి కడపటి రాజేందర్ రెడ్డి కార్యవర్గ సభ్యులు జిల్లాల గంగారెడ్డి, దమ్మా గంగారెడ్డి, జిల్లాల రాజారెడ్డి, పాతూరు జలపతి రెడ్డి, బోడుగం ముత్యం రాజు రెడ్డి, కుర్మ మహిపాల్ రెడ్డి, పాతూరి సురేష్ రెడ్డి, కడపటి మోహన్ రెడ్డి, పటేల్ గోపాల్ రెడ్డి, కుంభాల సంతోష్ రెడ్డి , జిల్లాల పెద్ద గంగారెడ్డి లు పాల్గొన్నారు.

# రంజాన్ తోఫా కిట్ల పంపిణీ






**నగర నిజం న్యూస్ , జవహర్ నగర్, తేదీ: 16 మార్చి:** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ నైస్ గార్డెన్‌లో రాష్ట్ర ప్రభుత్వం తరపున ముస్లిం సోదరులకు రంజాన్ తోఫా కిట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, హజ్ కమిటీ మెంబర్ మహమ్మద్ ముజీబ్రుద్దీన్ హాజరై ముస్లిం సోదరులకు రంజాన్ తోఫా కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రంజాన్ పర్వదినం శాంతి, సోదరభావం, సేవాభావానికి ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్, సీనియర్ నాయకులు సదానంద్, శంకర్ గౌడ్, వేణు, సత్తిష్ గౌడ్, ఫారుక్, పాషా మియా, కాలేశా, యూసుఫ్ పటాన్, ఉమర్, రాష్ట్ర నాయకురాలు అనంతలక్ష్మి, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు చింత విజయ, గండి సునీత, రజిత గోపాల్, లత, సునీత, ముస్లిం మత పెద్దలు, మసీదు కమిటీ సభ్యులు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

# అర్హులైన పేదలకు ఇంటి స్థలం ఇవ్వాలి

- సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు పి.జగన్
- డిప్యూటీ తహశీల్దార్ కు వినతిపత్రం అందజేత



**ఇబ్రహీంపట్నం, మార్చి 16 ( నగరనిజం ) :** మండల పరిధిలోని దండుమైలారం గ్రామంలో అర్హులైన పేదలందరికీ ఇంటి స్థలాలు ఇవ్వాలని సోమవారం సీపీఐ(ఎం) పార్టీ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం మండల డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాస్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పి.జగన్ మాట్లాడుతూ... అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. దండుమైలారం గ్రామంలో దాదాపు 250 కుటుంబాలకు ఇంటి స్థలాలు లేవని, చాలీచాలని ఇరుకు గదుల్లో సంసారాలు నెట్టుకొస్తున్నారని ఆవేదన చెందారు. ఒక ఇంట్లో రెండు మూడు కుటుంబాలు కాపురం చేస్తున్నారని, గ్రామంలోని సర్వే నెంబర్ 101,102,103,109 లలో దాదాపు 40 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నదని దానిలో ఇంటి స్థలం లేని పేదలందరికీ వంద గజాల చొప్పున ఇంటి స్థలం ఇవ్వాలని కోరారు. భూముల రేట్లు ఆకాశాన్ని అంటడంతో ఇంటి స్థలాన్ని కొనుగోలు చేసే ఆర్థిక స్థోమత పేదలకు లేదన్నారు. కొంతమందికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన స్థలం లేకపోవడంతో ఇల్లు కట్టుకోలేదన్నారు. గత ఎన్నికల్లో ప్రభుత్వం ఇంటి స్థలం లేనివారికి ఇంటి స్థలం, ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి రూ. 5 లక్షల రూపాయలు ఇస్తానని వాగ్దానం చేసిందన్నారు. కాబట్టి ఇచ్చిన మాట ప్రకారం పేదలకు ఇంటి స్థలాలు కేటాయించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులు సీహెచ్ నర్సింహా, శాఖ కార్యదర్శి తింక యాదగిరి, సీపీఐ(ఎం) నాయకులు మంకు జంగయ్య, కాస మల్లేష్, మున్సిపల్ కార్యదర్శి సీహెచ్ ఎల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశ్రీశ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవానికి ఆహ్వానం

- బాసు హనుమంతు నాయుడు కి అందచేసిన ఆలయ కమిటీ సభ్యులు



**గద్వాల జిల్లా : నగర నిజం మార్చి 16 (ప్రతినిధి ఎర్రమన్న బాలరాజు)** జిల్లా కేంద్రంలోని శ్రీ రామాలయ దేవస్థానం నందు ఈ నెల 27 న తేదీన జరిగే శ్రీశ్రీశ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవానికి సందర్భంగా సోమవారం నాడు గద్వాల నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి బాసు హనుమంతు నాయుడు ని ఆలయ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేసి, ఆహ్వానించారు ఆలయ కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు

# గ్యాస్ వినియోగదారులు ఈకేవైసీ అప్డేట్ చేసుకోవాలి








- వీటి విజయ్ కుమార్
- ప్రియాంక గ్యాస్ ఏజెన్సీ వినియోగదారులకు ప్రియాంక గ్యాస్ ఏజెన్సీ అధినేత విజయ్ కుమార్ సూచన
- ప్రభుత్వ నిబంధనల ప్రకారం గ్యాస్ రీఫిల్లింగ్ కోసం ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని సూచన
- ఇరాన్, ఇజ్రాయిల్ యుద్ధ ప్రభావంతో శంషాబాద్ లో జటిలమైన గ్యాస్ సమస్య

- గ్యాస్ రీ ఫిల్లింగ్ కోసం ప్రియాంక గ్యాస్ ఏజెన్సీ వద్ద క్యూ కడుతున్న వినియోగదారులు

**రాజేంద్రనగర్, మార్చి 16 (నగరనిజం ప్రతినిధి):** ఇరాన్, ఇజ్రాయిల్ అమెరికా దేశాల మధ్యన కొనసాగుతున్న వార్ నేపథ్యంలో గ్యాస్ కొరతతో వినియోగదారులు అల్లాడుతున్నారు. సకాలంలో గ్యాస్ సిలిండర్లు దొరకక అవస్థలు పడుతున్నారు. మరోవైపు గ్యాస్ రీ ఫిల్లింగ్ చేసుకోవాలనుకునే వినియోగదారులు తక్షణమే ఈకేవైసీ నీ అప్డేట్ చేసుకోవాలని శంషాబాద్ ప్రియాంక గ్యాస్ అధినేత వీటి విజయ్ కుమార్ సూచించారు. ఇరాన్, ఇజ్రాయిల్, అమెరికా యుద్ధం నేపథ్యంలో మొత్తం దేశవ్యాప్తంగా గ్యాస్ కొరత నెలకొందని ఆయన వెల్లడించారు. ఈ నేపథ్యంలో గ్యాస్ రీఫిల్లింగ్ కోసం కేంద్ర ప్రభుత్వం (పెట్రోలియం శాఖ) మార్గదర్శకాలు చేసిందని ఆయన చెప్పారు. ఈ నేపథ్యంలో శంషాబాద్ ప్రియాంక గ్యాస్ ఏజెన్సీ కి సంబంధించి గ్యాస్ రీ ఫిల్లింగ్ కోసం పట్టణం లోని వినియోగదారులు కనీసం 25 రోజుల ముందు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని, అదేవిధంగా గ్రామీణ ప్రాంతానికి చెందిన వినియోగదారులు 45 రోజుల ముందు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని ప్రియాంక గ్యాస్ ఏజెన్సీ అధినేత వీటి విజయ్ కుమార్ స్పష్టం చేశారు. మరోవైపు ప్రతి ఒక్క గ్యాస్ వినియోగదారుడు తప్పనిసరిగా ఈకేవైసీ అప్డేట్ చేసుకోవాల్సి ఉంటుందని, ఇందుకోసం వినియోగదారులు శంషాబాద్ లోని ప్రియాంక గ్యాస్ ఏజెన్సీలో గానీ, తమ వద్దకు వచ్చే డెలివరీ బాయ్ తో గాని ఈ కేవైసీ అప్డేట్ చేసుకోవాలని ఆయన సూచించారు. వినియోగదారులు ఈ కేవైసీ అప్డేట్ చేసుకుంటేనే గ్యాస్ రీ ఫిల్లింగ్ దరఖాస్తు అంగీకరించబడుతుందని, లేకపోతే దరఖాస్తు అంగీకరించబడదని విజయ్ కుమార్ స్పష్టం చేశారు. చాలామంది వినియోగదారులు ఈ కేవైసీ ని అప్డేట్ చేసుకోకపోవడం వల్ల గ్యాస్ ఫ్రీ ఫిల్లింగ్ బుకింగ్ కావడం లేదని, ఇది తెలియక చాలామంది వినియోగదారులు అయోమయానికి గురవుతున్నారని విజయ్ కుమార్ చెప్పారు. అదేవిధంగా గ్యాస్ రీ ఫిల్లింగ్ చేసుకున్నాక వినియోగదారులు తప్పనిసరిగా తమ డీఏసీ(ఓటీపీ)ని డెలివరీ బాయ్ కి ఇవ్వాలని విజయ్ కుమార్ సూచించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నిర్ణీత గడువు లోపు దరఖాస్తు చేసుకున్న వారికి మాత్రమే గ్యాస్ రీ ఫిల్లింగ్ చేసుకునే అవకాశం ఉంటుందని, ఈ విషయాన్ని వినియోగదారులందరూ గ్రహించాలని ఆయన సూచించారు.

# ఆశా కార్యకర్తల సమస్యలను పరిష్కరించండి





- కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి
- బి ఆర్ టి యూ జిల్లా అధ్యక్షులు టైగర్ కృష్ణయ్య

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి మర్చి 16 నగర నిజం :** వికారాబాద్ జిల్లాలో మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్మెంట్లో పనిచేస్తున్న ఆశా కార్యకర్తల సమస్యలను వెంటనే పరిష్కరించాలని బి ఆర్ టి యు జిల్లా అధ్యక్షుడు టైగర్ కృష్ణయ్య అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆశా కార్యకర్తలకు కనీస వేతనం రూ . 18000/ - ఇస్తామన్న మాట నిలబెట్టుకోవాలని, ఆశా కార్యకర్తలకు ప్రమాద బీమా 50 లక్షలు ఇవ్వాలని, కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, అర్హులైన ఆశాలకు ఏఎన్ఎం పోస్టులు ఇవ్వాలని, ఆశా కార్యకర్తలపై రాజకీయ వేధింపులు ఆపాలని, ఇండ్లు లేని నిరుపేద ఆశలకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని, ఆశా కార్యకర్తలకు రిటైర్మెంట్ బెనిఫిట్ కనీసం ఐదు లక్షలు రూపాయలుఇవ్వాలని, రిటైర్డ్ ఆషాలకు నెలకు 10,000 /- రూ పెన్షన్ ఇవ్వాలని, డిమాండ్ చేస్తూ సోమవారం నాడు బి ఆర్ టి యు జిల్లా అధ్యక్షులు టైగర్ కృష్ణయ్య ఆధ్వర్యంలో తెలంగాణ గ్రామీణ ఆరోగ్య ఆశా కార్యకర్తల సంఘం (బిఆర్టియు అనుబంధం)లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలు, నల్లబ్యాడ్జీలు ధరించి జిల్లా కలెక్టర్ ను , జిల్లా వైద్యాధికారిణి కలసి తమ సమస్యలు పరిష్కరించాలని కోరడం జరిగింది. జిల్లా కలెక్టర్ దీపక్ తివారి మాట్లాడుతూ.. తప్పకుండా నా పరిధిలో ఉన్న సమస్యలను తప్పకుండా పరిష్కరిస్తానని తెలియజేశారు.అలాగే రాష్ట్ర పరిధిలో ఉన్న సమస్యలను కమీషనర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేటట్టుగా చూస్తామని హామీ ఇచ్చారు. ఐవీ&ఏూ స్వర్ణ కుమారి మాట్లాడుతూ... తప్పకుండా జిల్లా పరిధిలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తామని , పెండింగ్ జీతాలు వచ్చిన వెంటనే తప్పకుండా చెల్లిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం డిఆర్టియు జిల్లా అధ్యక్షులు టైగర్ కృష్ణయ్య మాట్లాడుతూ టిఆర్ఎస్ పార్టీ ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఉన్న రోజుల్లో ఆశా కార్యకర్తలను గుర్తించి వారి శ్రమని గౌరవించి దాదాపుగా 10000 జీతం వరకు పెంచి ప్రతినెల 1వ తేదీ నాడే జీతాలు వచ్చేవని ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం మూడు మూడు నెలల వరకు పాత జీతాలు కూడా ఇవ్వడం లేదని కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టో లో పెట్టిన విధంగా నెలకు 18 వేల రూపాయల జీతం ఇవ్వాలని, ఆశా కార్యకర్తలకు అర్హులైన వారికి ఏఎన్ఎం, జిఎన్ఎమ్, పోస్టులు ఇవ్వాలని, ఆరోగ్య భీమా 50 లక్షల వరకు ఇవ్వాలని, ఇల్లు లేని పేద ఆశలకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని, ఆశలకు పెన్షన్ నెలకు పదివేల ఇవ్వాలని, డిమాండ్ చేశారు. ఐదు రోజుల నుండి రాష్ట్రవ్యాప్తంగా జిల్లాలో సంపూర్ణంగా ఆశాలు సమ్మె చేస్తున్నారని, ప్రభుత్వం వైఖరి ఇలాగనే కొనసాగితే సమ్మె మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలను ప్రతి ఒకటి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేదంటే ప్రభుత్వానికి కార్మిక వర్గం రాబోవు కాలంలో తగిన బుద్ధి చెబుతుందని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కె . అనిత. జ్యోతి. చంద్రాకల, రంజిత, యాదమ్మ, వెంకటమ్మ, గంగ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# 13 లక్షల రూ -సీసి రోడ్ల నిర్మాణానికి కు శ్రీకారం





- గ్రామ అభివృద్ధికి సహకరించిన మంత్రి జూపల్లి కృష్ణారావు కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన
- రాయినిపల్లి సర్పంచ్ హేమాద్రి నాయుడు

**వనపర్తి జిల్లా: నగర నిజం మార్చి 15 (ప్రతినిధి ఎర్రమన్న బాలరాజు)** పానుగల్ మండలం రాయినిపల్లి గ్రామ సర్పంచ్ హేమాద్రి నాయుడు మాట్లాడుతూ మన గ్రామ పంచాయతీ కి ఎన్ ఆర్ ఈ జి ఎస్ నిధుల నుండి వచ్చినటువంటి 13 లక్షల రూపాయల సిసి రోడ్ల కు భూమి పూజ నిర్వహించడం జరిగింది. ఇట్టి నిధులను ఇచ్చినటువంటి మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు కి ప్రత్యేకమైన ధన్యవాదములు అదేవిధంగా పానగల్ మండల నాయకులు వనపర్తి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్ సాగర్, మాజీ ఎంపీపీ వెంకటేష్ నాయుడు, మాజీ జెడ్పిటిసి రవి కి గ్రామ ప్రజలు ధన్యవాదాలు తెలుపడం జరిగింది. అని అన్నారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి రూప, వార్డు మెంబర్స్ వై రాములమ్మ, వై లాలయ్య కొమ్ముల నరసింహ. మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు కావాలి కురుమయ్య, మీనగా మైబుసు మీనిగ నారాయణ,కొమ్ముల దేవేంద్రం, వై కుర్మయ్య లాలయ్య, వై కురుమయ్య శేషయ్య, వై కురుమయ్య ,రాములయ్య, కొమ్ముల రాఘవేంద్ర, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

Edited & printed and owner,publisher Yela purushotham,(Regd): H-No 11-21-890,Ntr Nagar,L.B nagar saroor nagar mandal,Rangareddy-Dist,500074, printed Y.p.s publication H-No 11-21-890,Ntr Nagar,L.B nagar, saroor nagar mandal,Rangareddy-Dist,TELANGANA-500074, Editor Yela purushotham.(H.O) : plot no:31,H-No 1-13,kuntloor road,Near hayathanagar,abdullapur mettu mandal,rangareddy dist,TELANGANA-501505,
RNI NO: APTEL/2013/54450.(PRGI) .PH NO:8247467562 Email; nagaranijam@gmail.com.Whatsapp no : 8247467562,WEBSITE: WWW.NAGARANIJAM.COM.TELANGANA STATE